# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలను అందించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.
- 'స్త్రీ శక్తి' పేరిట రాష్ట్రంలోని మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించనున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.
- రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి 194 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు.
- భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగిన అండర్‌సన్ టెండూల్కర్ ట్రోఫీ చివరి టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం సాధించి సిరీస్ ను 2-2 తేడాతో డ్రా చేసుకుంది.

==============================

రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీడీపీ), కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... నాణ్యమైన జీవన ప్రమాణాలను సాధించే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల 47 వేల 871 రూపాయల తలసరి ఆదాయం సాధించాలని, దీనికి అనుగుణంగా 2029 నాటికి 5 లక్షల 42 వేల రూపాయల తలసరి ఆదాయం లక్ష్యంగా చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఆయా రంగాల్లో ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని, స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు.

==============================

'స్త్రీ శక్తి' పేరిట రాష్ట్రంలోని మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయనున్నామని రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. అమరావతిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. మొత్తం 6,700 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తామని చెప్పారు. ఈ పథకం అమలు చేసేందుకు రాష్ట్ర

ప్రభుత్వం 1950 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

==============================

రాష్ట్రంలో 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి 194 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈరోజు చిత్తూరు జిల్లా అలత్తూరు గ్రామపంచాయతీ ఈడిగపల్లి గ్రామంలో 20.80 లక్షల రూపాయలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని స్థానిక శాసనసభ్యులు వి.ఎం.థామస్ తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామస్థాయిలో ఇంటింటికి వైద్య సేవలు అందించడంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2017లో విలేజ్ హెల్త్ క్లినిక్ ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో విలేజ్ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలియజేశారు.

==============================

రాష్ట్రాన్ని ఈ సంవత్సరం చివరినాటికి లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్ గా మారుస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో IEC కెపాసిటీ బిల్డింగ్ పై రాష్ట్ర స్థాయి కార్యశాలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల కమిషనర్లు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వాహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. నగరాలను వ్యర్థాల రహితంగా మార్చేందుకు మున్సిపల్ కమిషనర్లు కీలకంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలోని 5 నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం గర్వకారణంగా ఉందన్న మంత్రి.. అవార్డులు పొందిన మున్సిపాల్టీల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. స్వచ్ఛాంధ్ర సాధనపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి నారాయణ సూచిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

==============================

రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈరోజు సచివాలయం సమీపంలోని మందడం గ్రామంలో స్టీల్ స్లాగ్ విధానంలో రహదారుల మరమ్మతులను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు రాష్ట్రంలో మెరుగైన రహదారులు నిర్మించాలనే లక్ష్యంతో ఇటువంటి వినూత్న విధానాలను ప్రయోగాత్మకంగా చేపట్టడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. వ్యర్థాల నుండి సంపద సృష్టించాలన్న ప్రభుత్వం ఆలోచన మేరకు స్టీల్ ప్లాంట్ వ్యర్థాల నుంచి వచ్చిన మిశ్రమాలతో రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నామని జనార్దన్ రెడ్డి తెలియజేశారు.

==============================

ప్రజల ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈరోజు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అండ్రంగి గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజల ఆశీర్వాద బలంతోనే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, ఏడాది కాలంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ పాలన అందించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఉత్సాహంగా ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు.

==============================

కులవివక్షను ఎదిరించి పోరాడే తత్వాన్ని, సహనాన్ని పేదరికం అలవరిచిందని గుఱ్రం జాషువా చెప్పేవారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఈ రోజు పల్నాడు జిల్లాలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రను నరసరావుపేటలో ఆయన ప్రారంభించారు. పట్టణంలోని గుఱ్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గుఱ్రం జాషువా సాహిత్యం యువతకు ఆదర్శమన్నారు. వివక్షను కేవలం చదువుతోనే రూపుమాపగలమన్న జాషువా మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలని పీవీఎన్ మాధవ్ సూచిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

రాష్ట్రంలోని రెండు కేంద్ర విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం గత 5 సంవత్సరాల్లో 529.14 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసిందని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ తెలిపారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానమిస్తూ వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయానికి 404 కోట్ల రూపాయలు, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి 125 కోట్ల రూపాయలు విడుదల చేశామని పేర్కొన్నారు.

==============================

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగిన చివరి టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం సాధించింది. దీంతో అండర్‌సన్ టెండూల్కర్ ట్రోఫీని 2-2 తో భారత్ సమం చేసుకుంది. 6 వికెట్లు నష్టపోయి 339 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఐదవ రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ 9 ఓవర్ల స్వల్ప వ్యవధిలోనే చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 5 వికెట్లు, ప్రసిధ్ కృష్ణ 4 వికెట్లు తీసి ఈ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును మహ్మద్ సిరాజ్ గెలుచుకోగా, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును శుభ్ మన్ గిల్, హేరీ బ్రూక్ సంయుక్తంగా దక్కించుకున్నారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,599 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 419 పాయింట్ల లాభంతో 81,018 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157 పాయింట్ల లాభంతో 24,722 వద్ద ముగిసింది.

==============================

రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు.. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలియజేశారు.

==============================
==============================